

తిరుపతి గ్రేటర్ ప్రతిపాదన వాయిదా

జనగణన నోటిఫికేషన్‌తో బ్రేక్.. 2027 మార్చి తర్వాతే ప్రక్రియ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: గ్రేటర్ తిరుపతి, గ్రేటర్ ఏర్పాటుపై ప్రభుత్వం సానుకూలంగా ఉన్నప్పటికీ తాజా జనగణన పూర్తి అయిన తర్వాత ఈ ప్రక్రియ ప్రారంభించాలని భావి స్తోంది. ఇప్పటికే జనగణన నోటిఫికేషన్ వెలువడగా, మరో మూడు నెలల్లో ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. దీంతో దేశ వ్యాప్తంగా ఎలాంటి భౌగోళిక మార్పులు చేపట్టే అవకాశం లేనందున జనగణన తర్వాతనే గ్రేటర్ అంశా లను పరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంత్రి నారాయణ ఈ విషయం వెల్లడించారు. తిరుపతి, విజయవాడలను గ్రేటర్ సిటీ లుగా అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనలు ప్రస్తుతానికి వాయిదా పడ్డాయి. ప్రస్తుత తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని విస్తరించి, చుట్టుపక్కల ఉన్న గ్రామాలను కలిపి గ్రేటర్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్గా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు తిరుపతి మున్సిపల్ కౌన్సిల్ ఇప్పటికే ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదనలో తిరుపతి రూరల్, రేణిగుంట, చంద్రగిరి, యేర్పేడు మండలాల పరిధిలోని 62 పైగా గ్రామాలు విలీనం చేయనున్నారు. దీనివల్ల ప్రస్తుతం సుమారు 30 చదరపు కిలోమీట ర్లుగా ఉన్న నగర విస్తీర్ణం 280-300 చదరపు కిలోమీటర్లు పైగా పెరగ నుంది. గ్రేటర్ తిరుపతి 2027 మార్చి తర్వాతనే ప్రక్రియ ప్రారంభించే అవకాశముంది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పాలకొరకు వచ్చే ఏడాది మార్చి 18వ తేదీ కాల పరిమితి ముగియనున్నది. ఇప్పటికే ఇక్కడ మేయర్ గా డాక్టర్ శిరీష వైఎస్ఆర్సిపి పార్టీ తరఫున కొనసాగుతున్నారు. టిడిపి నుంచి ఆర్సి మునికృష్ణ డిప్యూటీ మేయరుగా కొనసాగుతున్నారు. వైసిపి పార్టీ నీతో గెలిచిన డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ కూటమి పార్టీ వైపు ఉన్నారు. తిరుపతి కార్పొరేషన్ లో వైసీపీ పార్టీ కార్పొరేషన్ ఎన్నికల్లో 49 స్థానాలకు 48 కార్పొరేటర్లు గెలుచుకోవడం జరిగింది. 31 డివిజన్ కార్పొరేటర్ గా ఆర్సి మునికృష్ణ గెలుపొందారు. కూటమిప్రభుత అధికారంలో వచ్చిన తర్వాత ఆర్సి మునికృష్ణ డిప్యూటీ మేయర్ గా గెలిచారు. తిరుపతిని గ్రేటర్ చేయాలని ఈ ఏడాది అక్టోబర్లో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగింది. పలు అభ్యంతరాలు వచ్చినప్పటికీ కమిషనర్ మోర్య జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు తిరుపతి గ్రేటర్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగింది. అయితే చంద్రగిరి నియోజకవర్గం వైసీపీ సర్పంచ్లు మాత్రం తమ గ్రామాలు గ్రేటర్లో కలపవద్దని పాలకమండలి సమావేశంలో తీర్మానం చేసిన విషయం తెలిసిందే. తిరుపతి గ్రేటర్ గా మారితే కేంద్ర ప్రభుత్వం నుంచి ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు ఎక్కువ వచ్చే అవకాశం ఉందని అధికారులు భావించారు. కానీ ప్రతిపాదన ఏడాది పాటు వాయిదా పడడంతో దీని ప్రభావం తిరుపతి అభివృద్ధిపై పడుతుంది. రసం తిరుపతి జనాభా నాలుగు నుంచి నాలుగున్నర లక్ష మంది కలిగి ఉన్నారు. తిరుపతి గ్రేటర్ 7 నుంచి 8లక్ష ఓటర్లు ఇందులోకి రానున్నారు.

జనగణన తర్వాత ఏర్పాటు: మంత్రి నారాయణ

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు గ్రేటర్ తిరుపతి, గ్రేటర్ విజ యవాడ చేయాలని నిర్ణయించినట్లు మంత్రి పి.నారాయణ తెలిపారు. రాజ ధాని అమరావతి తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో ఇటీవల ముగ్గురు సభ్యుల కమిటీ సమావేశం జరిగింది. అనంతరం నారాయణ మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం జనగణన ప్రారంభించిందని, అది పూర్తి అయ్యేదాక డీలిమిటేషన్ చేయవద్దని ఆదేశాలు ఉన్నాయని చెప్పారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత విజయవాడ, తిరుపతిలను మహానగరాలుగా మారుస్తామన్నారు.

ప్రత్యేక అధికారుల పాలన...

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ కాలపరిమితి వచ్చే ఏడాది మార్చి 18వ తేదీ ముగియనుంది. దీంతో ఐదు సంవత్సరాల పాలన ముగుస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి గ్రేటర్ చేయాలని నిర్ణయించడంతో ఎన్నికలు జరగడానికి కనీసం కొంత సమయం పట్టవచ్చు. కేంద్ర ప్రభుత్వం జనగణ సర్వే చేపడితే వచ్చే ఏడాది మార్చి 19వ తేదీ నుంచి ప్రత్యేక అధికారుల పాలన తిరుపతి కార్పొరేషన్ సాగుతుంది. గత ఐదేళ్లుగా కౌన్సిల్ ఉండడంతో వారి కాలపరిమితి ముగియనుంది.

గ్రేటర్ తిరుపతి కోసం నగరవాసులు మరో సంవత్సరం ఆగాల్సిఉంది..

కిషోర్ మరణంపై సిట్ దర్యాప్తు చేయాలి

న్యాయవాది కె.విజయ్ కిరణ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కెవిబిపురం, కలత్తూరు హరిజన వాడకు చెందిన కిషోర్ మృతి సంబంధించి వాస్తవాలు వెలుగు లోకి రావాలంటే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తో మాత్రమే సాధ్యమవుతుందని న్యాయవాది కె.విజయ్ కిరణ్ తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువకుడు కిషోర్ నివాస ప్రాంతానికి సమీపం లోని అగ్రకులాలకు సంబంధించిన మైనర్ అమ్మాయిని ప్రేమిం చాడని, ఈ ఏడాది ఆగస్టు 11వ తారీఖున ఆ అమ్మాయి కనిపిం చలేదని, 12వ తేదీ విద్యుత్ వైర్లకు వేలాడుతూ కిషోర్ విగత జీవిగా ఉండడం, పోలీసులు వచ్చి కిందకు దించి బంధువులకు అప్పజెప్పడం, అటు తర్వాత అమ్మాయికి సంబంధించి గాని, అబ్బాయికి సంబంధించి గాని ఎటువంటి కేసు నమోదు కాలేదు. దీనిపై ఎన్ హెచ్ ఆర్ సి కి ఫిర్యాదు చేసి వాస్తవాలు వెలుగులోకి తేవాలని అభ్యర్థించగా, వారు రాష్ట్ర డిజిపికి తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడుకు వాస్తవాలు వెలుగులోకి తీసుకురావడానికి దర్యాప్తు చేయాలని ఆదేశించాలన్నారు. అయినా ఇప్పటివరకు ఆ దిశగా ఇటువంటి దర్యాప్తు జరగకపోగా ఈ విషయాన్ని వెలుగులోకి రాకుండా చూడడం వెనుక ఆంతర్యం ఏమిటో ప్రజలు తెలుసుకోవాలన్నారు. అగ్రకులాలకి ఒకలా దళిత కులాలకు ఒకలా అధికారి వ్యవహరించకూడదని, ఇటువంటి విషయాలలో కులాంతర వివాహాల పరిరక్షణ చట్టం ఏర్పాటు అమల్లోకి వస్తే ఇటువంటి ఘటనలకు చోటు ఉండదన్నారు. ప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచించి అందరూ సమానమేనని భావనతో కులాంతర వివాహాల పరిరక్షణ చట్టం ఏర్పాటు దిశగా అడుగులు వేయాలన్నారు. కిషోర్ తండ్రి మోహన్ ఆయన కుటుంబ సభ్యులు కొడుకు మరణంతో తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారని, ఇప్పటికీ ఆ మైనర్ బాలిక ఎక్కడ ఉందో ఆచూకీ కూడా తెలియకపోవడం సమాజం ఎటువైపు అడుగులు వేస్తుందో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయ జీవితాలకు భరోసా 'యుటిఎఫ్'



ఉమారాణి కుటుంబ సభ్యులకు లక్ష రూపాయలు చెక్కు అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలోనే కాక, వారి జీవితాలకు సైతం యుటిఎఫ్ భరోసాగా ఉంటోందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, తిరుపతి జిల్లా కుటుంబ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎస్ఎస్ నాయుడు పేర్కొన్నారు. రేణిగుంట మండలం. అన్నాసామిపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల మరణించిన ఉమారాణి కుటుంబ సభ్యులకు యూటీఎఫ్ తిరుపతి జిల్లా కుటుంబ సంక్షేమ సంఘం తరపున ఆదివారం లక్ష రూపాయలు ఆర్థిక సాయమందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ఉపాధ్యాయుల సంక్షేమం కోసం కృషి చేసే యుటిఎఫ్ ఆపద సమయాలలో వారి వెంట నిలవడానికి కుటుంబ సంక్షేమ సంఘాన్ని స్థాపించి కొనసాగిస్తోందని తెలిపారు. దీని ద్వారా మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలకు తక్షణం ఒక లక్ష రూపాయలు అందిస్తోందని తెలియజేశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిజే రాజశేఖర్, ముత్యాల రెడ్డి మాట్లాడుతూ యుటిఎఫ్ వ్యవస్థాపకుడు దాచూరి రామి రెడ్డి ఆలోచనతో ప్రారంభించిన కుటుంబ సంక్షేమ సంఘం దురదృష్టవశాత్తు మరణించిన ఎందరో ఉపాధ్యాయుల కుటుంబాలకు అండగా నిలిచిందని, ఈ పథకం కింద తిరుపతి జిల్లాలో 2200 మంది సభ్యులు ఉన్నారని తెలియజేశారు. కుటుంబ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి మోహన్ బాబు, కోశాధికారి బెంజిమన్ రాజేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభలను జయప్రదం చేద్దాం

విశాఖకు చేరుకున్న తిరుపతి సిఐటియు బృందం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: సిఐటియు 18వ అఖిల భారత మహాసభలు డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు ఐదు రోజులపాటు జరగనున్న నేపథ్యంలో, ఈ మహాసభలను జయప్రదం చేయాలనే లక్ష్యంతో తిరుపతి నుంచి సిఐటియు బృందం బయలుదేరింది. ఈ మహాసభలలో దేశవ్యాప్తంగా కార్మిక వర్గం ఎదుర్కొంటున్న అనేక కీలక సమస్యలపై విస్తృతంగా చర్చించి, భవిష్యత్ పోరాటాలకు సంబంధించిన కీలక తీర్మానాలు చేయనున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎస్. జయచంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు వేణుగోపాల్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించే విధంగా 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకువచ్చిందని, ఇవి కార్మికుల గొంతు కోసే చర్యలని వారు తీవ్రంగా విమర్శించారు. ఈ లేబర్ కోడ్స్ ద్వారా సంఘటిత, అసంఘటిత రంగాల మధ్య విభజన పెరిగి కార్మికులు మరింత అసురక్షిత పరిస్థితుల్లోకి నెట్టబడుతున్నారని పేర్కొన్నారు. ఈ లేబర్ కోడ్స్ రద్దు కోసం రానున్న కాలంలో దేశవ్యాప్తంగా విస్తృత పోరాటాలు రూపకల్పన చేయనున్నట్లు వెల్లడించారు. పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి 12 గంటల పని విధానం అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని, ఇది కార్మికులను యంత్రాల్లా మార్చే ప్రయత్నమని సిఐటియు తీవ్రంగా ఖండించింది. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాలు మరింత ఉధృతంగా సాగుతాయని పిలుపునిచ్చారు. అలాగే కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, కనీస వేతనాలు తప్పనిసరిగా అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం దేశవ్యాప్తంగా చట్టబద్ధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సామాజిక భద్రతను కాపాడాల్సిన బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పించుకోరాదని స్పష్టం చేశారు. ప్రత్యేకంగా అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కూలీలు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, గిగ్ వర్కర్లు, నిర్మాణ కార్మికులు, పారిశుధ్య కార్మికులు తీవ్రమైన ఉపాధి అస్థిరత, తక్కువ వేతనాలు, పని భద్రత లేని పరిస్థితులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సంఘ టిత హక్కులు లేకుండా, చట్టపరమైన రక్షణ లేకుండా ఈ కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులకు వ్యతిరేకంగా కార్మికులను సంఘటితం చేసి, పోరాట పంథాను మరింత విస్తరించడమే సిఐటియు 18వ అఖిల భారత మహాసభల ప్రధాన లక్ష్యమని తెలిపారు. సిఐటియు 18వ అఖిల భారత మహాసభలు కార్మిక వర్గానికి దిశానిర్దేశం చేసే విధంగా, కార్మిక ఐక్యతను బలోపేతం చేసేలా అత్యంత విజయవంతంగా జరగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు యుగంధర్, వెంకటేష్, విద్యార్థి సంఘం నాయకులు పవిత్ర, అనిత, రవి, మార్క్స్ తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభలకు రైతు సంఘం సంఘీభావం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : విశాఖపట్నంలో 2025 డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 4వ తేదీ వరకు జరుగుతున్న సి.ఐ.టి.యు 18వ అఖిల భారత మహాసభలకు తిరుపతి జిల్లా గూడూరులో ఆదివారం రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత, జిల్లా ఉపాధ్యక్షులు జోగి శివకుమార్‌లు సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమానికి సి.ఐ.టి.యు సంఘీభావం ఇచ్చిన సంగతిని గుర్తు చేశారు. భవిష్యత్తులో కార్మిక కోడ్‌లు రద్దుకు రైతు సంఘం సంఘీభావంగా నిలబడడానికి హామీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య, సి.ఐ.టి.యు సీనియర్ నాయకులు టి. వెంకటరామిరెడ్డి, నావూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక మరమ్మతులతో ప్రజా ధనం వృధా : సిపిఎం

ప్రజాశక్తి - కేవీబీ పురం : ఓల్లూరు రాయలచెరువు మరమ్మత్తుల కోసం ప్రభుత్వ అనుమతితో ఇరిగేషన్ అధికారులు సుమారు రూ. 40 లక్షలతొ ఇసుక బస్తాల ఏర్పాటుకు టెండర్లు పనులు అప్పగించడం హాస్యాస్పదంగా ఉందని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, సత్యవేడు ఇంచార్జ్ దాసరి జనర్దన్ పేర్కొన్నారు. తాత్కాలిక మరమత్తు పనుల పేరుతో ప్రజా ధనాన్ని కాంట్రాక్టర్లకు ముట్టజెప్పేందుకు తప్పా, ఎలాంటి ఉపయోగం లేదని ఆయన మండిపడ్డారు. అధికారులు తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, మళ్ళీ ప్రమాదం వాటిల్ల కుండా పటిష్ట చర్యలు తీసువాలని డిమాండ్ చేసారు. అధికారులు, కాంట్రాక్టర్లు వారి సొంత పొలాలు, ఇళ్ళ మీద ఇలాంటి ప్రయోగాలు చేయాలని, పాతపాలెం, కళత్తూరు లాంటి దళిత గ్రామాల మీద కాదని హితవు పలికారు. తక్షణ మరమ్మత్తులు చేపట్టి రైతులకు నీరు ఇవ్వడానికి ఇది వర్షాకాలం కాదన్న విషయాన్ని అధికారులు గురు పెట్టుకోవాలన్నారు. రైతులకు ఉపయోగం లేని పనులతో ప్రజా ,ప్రభుత్వ ధనానికి గండి కొట్టాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ దృష్టి పెట్టి రాయల చెరువు నీటిని ఓల్లూరు, పాతపాలెం, సధాశివపురం, వడ్డికండ్రిగ, బొజ్జయ్య కండ్రిగ రైతులకు కూడా మేలు చేసే విధంగా పూర్తిగా పునరుద్దరించి, రైతులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. లేని పక్షంలో రైతులతొ కలిసి సీపీఎం తరపున పోరాటాలకు పిలుపు నిస్తామని హెచ్చరించారు.

పేటశ్రీకి పొనకా కనకమ్మ, దువ్వూరు రామిరెడ్డి స్మారక అవార్డు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం తెలుగు విభాగం విశ్రాంత ఆచార్యులు, తెలుగు అకాడమీ పూర్వపు అధ్యక్షులు ఆచార్య పేట శ్రీనివాసులురెడ్డికి పొనకా కనకమ్మ, దువ్వూరు రామిరెడ్డి స్మారక అవార్డును 2025 సంవత్సరానికి గాను దువ్వూరు రామిరెడ్డి విజ్ఞాన సమితి, నెల్లూరు వారు ప్రకటించారు. 2026 మార్చి/ఏప్రిల్ లో హైదరాబాద్‌లో జరిగే జయంతి సభలో రూ.25,000 నగదుతో బహుకరించి అవార్డును అందజేస్తారు. పేటశ్రీతో పాటు మరో ఏడు మంది వివిధ రంగాలలో కృషి చేసిన వారికి కూడా అవార్డులను ప్రదానం చేస్తారు. సాహిత్యంలో పేటశ్రీ చేసిన కృషికి గాను జ్యూరీ ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఇప్పటికే పేటశ్రీ ఇరవైకి పైగా జాతీయ, అంతర్జాతీయ అవార్డులను అందుకున్నారు. గతంలో తిరుపతి గంగ జాతర, కొండ కతలు, తిరు వీధులు, తిరుపతి కథలు గ్రంథాలకు కూడా అవార్డులొచ్చాయి. పేటశ్రీ మూదు వందల వ్యాసాలను ప్రచురించారు. చైనా, ఆస్ట్రేలియా, వియత్నాం, ఇండోనేషియా వంటి అనేక దేశాల్లో పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు, పరిశోధకులు, వర్సిటీ ఉన్నతాధికారులు, ఆచార్య పేటశ్రీకి అభినందనలు తెలిపారు.

కాపర్ దొంగలు..స్టార్టర్లు బద్దలు

అయోమయంలో రైతులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఓ వైపు నియోజకవర్గంలో రబీ సాగు యుద్ధ ప్రాతిపదికన సాగవుతుంటే.. ఇంకోవైపు కాపర్ దొంగలు విరుచుకుపడుతున్నారు. వ్యవసాయ క్షేత్రాలే లక్ష్యంగా రాత్రుళ్ళు మాటు వేసి స్టార్టర్లను బద్దలు కొడుతున్నారు. అందులోని కాపర్ తీగలను దొంగలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఫలితంగా మోటారు బోర్లు, బావుల సాయంతో పంటలు సాగు చేస్తున్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. స్టార్టర్ల చోరీపై విద్యుత్ శాఖాధికారులకు, పోలీసులకు రైతుల నుంచి ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకున్న పాపాన పోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. దీంతో రైతులకు స్టార్టర్ కష్టాలతోపాటు సాగు భారమవుతోంది. ఈ క్రమంలో తొట్టంబేడు మండలంలోని గుర్రప్ప నాయుడు కండ్రిగ, ఇలగనూరు, చిన్న కన్నలి వ్యవసాయ క్షేత్రాల్లో ఏకంగా 61 పైగా రైతులకు చెందిన స్టార్టర్లను బద్దలు కొట్టి గుర్తు తెలియని వ్యక్తులు కాపర్ తీగలను దొంగలించుకుని వెళ్లారు. ఆదివారం ఉదయం మోటార్లు వేసేందుకు స్టార్టర్లు వద్దకు వెళ్లిన రైతులకు గుండెలు బద్దలైనంత పనైంది.

ధ్వంసమైన స్టార్టర్లను చూసి లబోదిబోమనడం వారి వంతైంది. ఒక్క తొట్టంబేడు మండలంలోనే కాకుండా నియోజకవర్గం వ్యాప్తంగా కాపర్ దొంగలు స్టార్టర్లను కొల్లగొడుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఒక్కో స్టాటర్ ధర రూ.5వేలు ఉంటోందనీ, దొంగలు సర్వీస్ వైర్లు కూడా కత్తిరించుకుని వెళ్తుండడంతో మరో వెయ్యి అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి కాపర్ దొంగల పని పట్టాలని కోరుతున్నారు. లేకుంటే రబీ సాగు నరకమేనని వాపోతున్నారు.

పటిష్టమైన భద్రతతో నేర నియంత్రణ

విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, అదనపు ఎస్పీలు రవిమనోహర చారి, శ్రీనివాసులు, నాగ భూషణం

జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : పటిష్టమైన పకడ్బందీ భద్రతా ఏర్పాట్లతో - నేర నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బ రాయుడు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాల యంలో ఆదివారం తిరుపతి జిల్లా పోలీస్ శాఖ వార్షిక నివేదికను వెల్లడించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా ప్రపంచ ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రం. కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి వారు వెలసిన దివ్య క్షేత్రం. జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీకాళహ స్తితో పాటు తిరుచానూరు, నారాయణవనం, నాగలాపురం, శ్రీనివాస మంగాపురం, తలకోన లాంటి పుణ్య క్షేత్రాలు తిరుపతి జిల్లాలో వెలసి ఉన్నాయి. మన దేశానికే తలమానికమైన శ్రీహరి కోట అంతరిక్ష రాకెట్ కేంద్రం, శ్రీసిటీ, తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలతో కూడి వున్నది, తిరుపతి, రేణిగుంటలో రైల్వే స్టేషన్లు కలవు. అలాగే విశ్వ విద్యాలయాలు, అనేక కళాశాలలతో కూడి ప్రముఖ విద్యా కేంద్రంగా కూడా బాసిల్లుతున్నది. తిరుపతిలో స్విమ్స్, రుయా, బర్డ్ హాస్పిటల్ అనేక కార్పొరేట్ హాస్పిటళ్ళు ఉన్నాయని గుర్తు చేశారు. రోజూ వచ్చే లక్షలాది యాత్రికుల, ప్రజల రక్షణే ప్రథమ ధ్యేయంగా, తిరుపతి పట్టణము, హైవేలలో నిరంతరం ట్రాఫిక్‌ను నియంత్రణ, క్రమబద్ధీ కరణ చేస్తూ జిల్లా పోలీస్ శాఖ అకుంఠిత దీక్షతో రాత్రి, పగలు అని తేడా లేకుండా శాంతి భద్రతల పరిరక్షణలో ఎల్లప్పుడు ముందున్నదని చెప్పడానికి సంతోషిస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు వచ్చే వివిధ రకాల విఐపిల భద్రతలో ఎలాంటి రాజీ పడకుండా, సామాన్యమైన ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని వెల్లడించారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న గంజాయి, మాదకద్రవ్యాలను అరికట్టడంతో పాటు, టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతున్న వేళ ప్రజలు సైబర్ నేరాలబారిన పడకుండా వారికి అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు సైబర్ బాధితులకు జిల్లా పోలీస్ శాఖ అండగా ఉండి, సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

తిరుపతి జిల్లా వార్షిక నేరాల వివరాలు

2024వ సంవత్సరంలో 9118 కేసులు నమోదు కాగా ఈ సంవత్సరము 9253 కేసులు నమోదు కాబడ్డాయి. మొత్తంగా గత సంవత్సరం తో పోలిస్తే ఈ సంవత్సరం కేసుల నమోదు శాతము 0.71% మేరకు స్వల్పంగా పెరిగింది. దేహ సంబంధిత నేరాల (బాడీలీ ఆఫెన్సెస్) లో 2024 లో 1095 నేరాలు జరగగా 2025 లో 1029 నేరాలు జరిగాయి. ఆస్తి సంబంధిత నేరాల (ప్రాపర్టీ ఆఫెన్సెస్)లో 2024లో 1052 నేరాలు జరగగా 2025లో 1109 నేరాలు జరిగాయి. రోడ్డు ప్రమాదాల 2024 లో 1143, 2025లో 1145 ప్రమాదాలు, సైబర్ నేరాలు 2024లో 241, 2025లో 186 నేరాలు, వైట్ కాలర్ నేరాలు 2024లో 571 నేరాలు, 2025 లో 563 నేరాలు, ఇతర బిఎన్ ఎస్ నేరాలు (అథర్ ఐపీసీ) 2024లో 2257 నేరాలు జరగగా 2025 లో 3202 నేరాలు జరిగాయని వెల్లడించారు. సైబర్ క్రైమ్ నేరాల కేసుల నమోదు శాతం తగ్గింది.

2024 ఎన్.సి.ఆర్.పి (వితౌట్ ఎఫ్ఐఆర్, ఎఫ్ఐఆర్ కోర్టు ఆర్డర్)ల ద్వారా నమోదైన సైబర్ కేసులలో ఇప్పటివరకు రూ.12,31,75,974ల నగదును సైబర్ నేరగాళ్లు దోచుకోగా రూ.2,30,34,078ల నగదును రికవరీ చేసి నేరుగా భాధితులకు రీఫండ్ చేశామని తెలిపారు.

2025 ఎన్సిఆర్పిల ద్వారా నమోదైన సైబర్ కేసులలో ఇప్పటివరకు రూ.14,45,13,864ల నగదును సైబర్ నేరగాళ్లు దోచుకోగా రూ.3,53,01,114ల నగదును రికవరీ చేసి నేరుగా భాధితులకు రిఫండ్ చేయించడం జరిగిందన్నారు.

మొబైల్ ఫోన్ల రికవరీ: బాదితులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను రికవరీచేసి వాటిని బాదితులకు సకాలంలో అందించడంలో తిరుపతి జిల్లా పోలీస్ శాఖ మన రాష్ట్రంలోనే "ప్రధమ స్థానం" లో ఉందన్నారు.

ఫోక్సో, రేప్ కేసులు : 10 .. కోట, తిరుచానూర్, వెంకటగిరి, సూళ్ళూరుపేట(2), చంద్రగిరి, శ్రీకాళహస్తి రూరల్, చిల్లకూరు, బుచ్చినాయుడు, నాయుడుపేట పోలీస్ స్టేషన్లకు సంబందించిన పోక్సో మరియు రేప్ కేసులలో పైన తెలిపిన విధంగా శిక్ష పడింది.

హత్య కేసులు : 9 కేవీబీ పురం, తిరుపతి తూర్పు, నారాయణవనం, రామచంద్రాపురం, చంద్రగిరి, ఏర్పేడు, తిరుపతి పడమర, సూళ్ళురుపేట, ఓజిలి పోలీస్ స్టేషన్లకు సంబందించిన 9 హత్య కేసులు నమోదయ్యాయి.

తిరుపతి జిల్లా ఏర్పడి సుమారు 15 సంవత్సరాల తరువాత, ఇటీవల తిరుపతి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం (డీపీవో) ను రాష్ట్రంలోనే తలమానికంగా, అధునాతనమైన వసతులతో, ప్రజలందరికీ అందుబాటులో వుండే విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంబించుకోవడం, తిరుపతి జిల్లా పోలీస్ కి ఈ సంవత్సరం గొప్ప విజయంగా చెప్పుకోవడానికి సంతోషిస్తున్నామన్నారు. తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న క్రింది స్థాయి నుండి ఉన్నత స్థాయి అధికారుల వరకు నిరంతరం ఒక వైపు శాంతి భద్రతల పరిరక్షణ, మరో వైపు అసాంఘిక కార్యక్రమాల పైన కఠినంగా వ్యవహరిస్తూ ప్రజలతో మమేకమై ఉండి, ప్రజలకు అన్ని వేళలా మేము ప్రజల వెంట ఉంటామనే లక్ష్యంతో పని చేస్తూ, ప్రజల భద్రత, పరిరక్షణకై చట్ట పరిధిలో పని చేస్తున్నాము. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా మరింత అంకిత భావంతో పని చేస్తూ ప్రజల సహకారంతో శాంతి భద్రతలను పరిరక్షిస్తాము. మన దేశం లోనే కాకుండా, ప్రపంచ దేశాలలో ఎంతో పేరుగాంచిన ఈ తిరుపతి జిల్లాను అన్ని విధాలుగా ముందు ఉంచడానికి మీ వంతు సహాయ సహకారాలు అందించాలని మీడియను కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహర చారి, శ్రీనివాసులు, నాగ భూషణం, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

శెట్టిపల్లిలో జంగిల్ క్లియరెన్స్‌ను అడ్డుకున్న లబ్ధిదారుడు

అంతర్గతకక్షతో ప్రొసీడింగ్స్ ఇవ్వకపోవడమే కారణమా..?

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దశాబ్దాల కాలంగా శెట్టిపల్లి వివాదం ప్రభుత్వాలు మారిన లబ్ధిదారులకు మాత్రం ఎటువంటి న్యాయం జరగడం లేదు. వందలాది సమావేశాలు ఏర్పాటు చేసి, వందలసార్లు శెట్టిపల్లి భూములను పరిశీలించి చివరికి లబ్ధిదారులకు ప్రభుత్వాలు చేసింది అంటూ ఏమైనా ఉంది అంటే అది పూర్తిగా వాగ్దానాలే. గత ప్రభుత్వ హాయంలో శెట్టిపల్లి భూములకు శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామంటూ లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఇచ్చారు. ఇదే సందర్భంలో వేరొక పార్టీకి సానుభూతిపరులుగా ఉన్న శెట్టిపల్లి గ్రామస్తులుగా ఉన్న కొంతమందికి మాత్రం ఈ ప్రొసీడింగ్ కాఫీలు అందనట్లుగా తెలుస్తోంది. అధికారంలోకి వచ్చిన శెట్టిపల్లి భూ బాధితులకు న్యాయం చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో కదిలిన యంత్రాంగం శెట్టిపల్లి భూములను అభివృద్ధి చేస్తూ ప్లాట్లు, రైతుల లబ్ధిదారులకు భూ కేటాయింపులు, ప్లాట్ల కేటాయింపుకు తీవ్రమైన కసరత్తు చేసింది. తిరుపతి పట్టణ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన దివాకర్ రెడ్డి ముఖ్యమంత్రి వద్ద నుండి స్పష్టమైన ఆదేశాలతో జిల్లా కలెక్టర్‌ను కలిసి ఎంత వీలైతే అంత తొందరగా శెట్టిపల్లె భూ సమస్యను పరిష్కరించడానికి అనేక పర్యాయాలు కలెక్టరేట్ వేదికగా సమావేశాలను నిర్వహించారు. ఇందులో భాగంగా తుడా పరిధిలోకి శెట్టిపల్లి భూముల అంశాన్ని తీసుకువచ్చి లేఔట్ లో పూర్తి కోసం జంగిల్ క్లియరెన్స్ చేసి త్వరలో భూ పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయడానికి అడుగులు వేశారు. జెసిబి యంత్రాల సహాయంతో ముళ్ళ చెట్లను తొలగింపు కార్యక్రమం ప్రారంభించారు.

రాజకీయ కక్షలతో ప్రొసీడింగ్స్ ఇవ్వకుండా...

దశాబ్దాల కాలంగా నలుగుతున్న శెట్టిపల్లె భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే నేపథ్యంలో లబ్ధిదారులందరికీ పార్టీలకతీతంగా న్యాయం చేయాల్సిన గత ప్రభుత్వం భేషజాలకు పోయి శెట్టిపల్లిలో ప్రస్తుతం అధికార టిడిపి యూనిట్ ఇన్చార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సురేష్‌కు ఆనాడు ప్రొసీడింగ్ కాపీలు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారు. ఎంతకీ అతనికి సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను ఇవ్వకుండా అలానే ఉంచేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నాగాని ఇప్పటివరకు ప్రొసీడింగ్ కాపీలను సంబంధిత రెవెన్యూ అధికారుల నుండి తీసుకోవడానికి కాళ్లు అరిగేలా ఆ వ్యక్తి తిరుగుతూనే ఉన్నాడు. అయినను ఎటువంటి ఫలితాలు రాకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైన ఆ శెట్టిపల్లి టిడిపి యూనిట్ ఇన్చార్జి ఆదివారం తుడా ఆధ్వర్యంలో జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్ పనులను తమ పొలం వద్ద చేయొద్దని జెసిబి యంత్రాలను రానివ్వకుండా అడ్డుకోవడం స్థానికంగా పెద్ద చర్చే జరగడానికి కారణమైంది. అధికారంలో ఉన్నా కానీ వాస్తవానికి

తన భూమిలోకి జేసీబీలు రాకుండా అడ్డుకున్న సురేష్

లబ్ధిదారుడిగా తనకు రావలసిన భూ కేటాయింపుకు సంబంధించి ప్రొసీడింగ్ కాపీలను ఇవ్వకపోవడంపై సంబంధిత రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహ వేశాలు వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

రోడ్డు నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామీణ రోడ్లకు మహర్దశ చేకూరుతోందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పష్టం చేశారు. ఆదివారం పిచ్చాటూరు గంగమ్మ గుడి నుండి శ్మశానం వరకు రూ.12 లక్షలతో నిర్మించ తలపెట్టిన మెటల్ రోడ్డుకు ఆయన భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్నీ రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. సత్యవేడు నియోజకవర్గానికి పల్లె పండుగ 2.0 కార్యక్రమం కింద నియోజకవర్గానికి 148 పనులకు గాను రూ.1474.08 లక్షల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, అలాగే పిచ్చాటూరు మండలానికి 49 పనులకు గాను అనగా రూ.25 లక్షలతో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ గోడకు 25 లక్షలు మంజూరయినట్లు తెలిపారు. ముడియూరు, రామగిరి ఎస్ఎస్‌బి పేట గ్రామాలకు విహెచ్‌సి ఏర్పాటుకు ఒక్కొక్క సెంటర్‌కి రూ.36 లక్షల వంతున మొత్తం 108 లక్షల వ్యయంతో నిర్మించనున్నట్లు తెలిపారు. కీలపూడి పంచాయతీకి రూ.7 లక్షల నిధులు మంజూరైనాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహమ్మద్ రఫీ, పిఆర్‌డిఈ గోపాల్, ఎస్సై రాఘవేంద్ర, విద్యుత్ శాఖ ఏఈ సుబ్రమణ్యం రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఇళంగోవన్ రెడ్డి, ఆయకట్టు చైర్మన్ రవి రెడ్డి, సుమాంజలి, దిలీప్ రాజ్, వాసు రెడ్డి, ఢిల్లీ బాబు, వినాయగం, ఏసు అధికారులు, సిబ్బంది, నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

కూటమితోనే అభివృద్ధి సాధ్యం

అభివృద్ధి పనుల ప్రారంభ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ చొరవతో గూడూరు మండల పరిధి, చెన్నూరు అరుంధతీయవాడలో 20 లక్షల రూపాయలతో, మూడు సి.సి. రోడ్లు, ఒక డ్రైన్ పనులకు తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని చెన్నూరు అరుంధతీయ వాడలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ చొరవతో అభివృద్ధి పనులు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం గూడూరు శాసన సభ్యులు పాశిం సునీల్ కుమార్‌కి అరుంధతీయ వాడ ప్రజలు, కూటమి నాయకులు, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 24సొసైటీ అధ్యక్షుడు అల్లూరు కరుణాకర్ రెడ్డి, నాయకులు మట్టం మురళి, ముప్పాళ్ళ గిరి ప్రసాద్ రెడ్డి, పడాల రత్నయ్య, ఇందుకూరు శ్రీకాంత్ రెడ్డి, అల్లం కృష్ణయ్య, ఉగ్గుమూడి రవీంద్రారెడ్డి, ఏ.ఎం.సి డైరెక్టర్ మల్లి శ్యామల, ధర్మరాజుల స్వామి దేవస్థాన కమిటీ సభ్యులు కందుకూరు మౌనిక, ఉగ్గుమూడి మనోహర్ రెడ్డి, బూత్ కన్వీనర్లు శ్రీనివాసులు, రాజేంద్ర, రాజనాల, స్థానిక నాయకులు అనిల్, హరీష్,రమేష్, శంకరయ్య, నాయకులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

నూతన కాలమాన పట్టికల ఆవిష్కరణ

కేలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామక్రిష్ణ

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: వెంకటగిరి గ్రామ శక్తి పోలేరమ్మ, డక్కిలి మండలం, అముదూరు, కొలితోట చెంచమ్మ అమ్మవార్ల ఆలయాల 2026 నూతన సంవత్సరం క్యాలెండర్లను ఆదివారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు వేదమంత్రోచ్చారణల మధ్య ఆశీర్వాదాలు అందజేసి తీర్థప్రసాదాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవార్ల ఆశీస్సులతో రాష్ట్రానికి మళ్లీ అభివృద్ధి పథంలో పురోగతి సాధించే రోజులు వస్తున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, ఆలయ అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పేదల పార్టీ కాంగ్రెస్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పేదల పార్టీ కాంగ్రెస్ అని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్ రెడ్డి పేర్కొన్నారు. 141 వ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు, పీసీసీ ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులను ఘనంగా సత్కరించారు. బ్రిటిష్ వారి కబంధ హస్తాల నుండి విముక్తి కలిగించి దేశ ప్రజలకు స్వేచ్ఛ వాయువును అందించినటువంటి పార్టీ కాంగ్రెస్ అని దామోదర్ రెడ్డి అన్నారు. పేదల కోసం అనేక సంక్షేమాలు తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. అజిత్, నాగరాజు, అరుణ్, మహేష్,చరణ్, మాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐసి రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి - క్యాంపస్: దుకాణాలు, వాణిజ్య సంస్థలు, రెస్టారెంట్లు, లాడ్జీలు, హోటళ్లు, ఫ్యాక్టరీలు, పాఠశాలలు, కళాశాలలు మొదలైన వాటిలో 10 మంది లేదా అంతకంటే ఎక్కువ కార్మికులు పనిచేస్తున్నట్లయితే, ఆ సంస్థలు తప్పనిసరిగా కార్మిక రాజ్య బీమా సంస్థ ఈ.ఎస్.ఐ.సి పరిధిలోకి వస్తాయని ఈఎస్ఐసి అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.మధుసూదన్ తెలిపారు. ఆదివారం తిరుపతిలోని జీవకోన విశ్వం హైస్కూల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. డిసెంబర్ 31 తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకొంటే, గత కాలానికి సంబంధించిన బకాయిలు, పరిశీలనలు, జరిమానాలు లేకుండా రిజిస్ట్రేషన్ అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఈ పథకం ద్వారా బీమా చేయబడిన కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఉచిత వైద్య సేవలు, ప్రమాద బీమా, నిరుద్యోగ భృతి, ప్రసూతి ప్రయోజనాలు వంటి పలు సామాజిక సంక్షేమ పథకాల లబ్ధి పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో సామాజిక భద్రతాధికారి ఎస్.వేణుగోపాల్, ఈఎస్ఐసి తిరుపతి బ్రాంచ్ మేనేజర్ సి.నాగమణి, విశ్వం విద్యాసంస్థల ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్.విశ్వనాథ్ రెడ్డి, అప్పస్వామి నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ఏపీ ఫార్మా కౌన్సిల్ సభ్యుడిగా గుప్తా ఘన విజయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫార్మా కౌన్సిల్ సభ్యుడిగా శ్రీకాళహస్తికి చెందిన సీనియర్ ఫార్మాసిస్ట్, అరుణ మెడికల్స్ అధినేత సుబ్బరామ గుప్తా ఘన విజయం సాధించారు. ఫార్మా కౌన్సిల్ ఎన్నికలు 15 ఏళ్ల తర్వాత ప్రతిష్టాత్మకంగా జరిగాయి. ఈనెల 24వ తేదీ వరకు ఎన్నికలు నిర్వహించగా 44 మంది బరిలో నిలిచారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి కౌన్సిల్ మెంబర్ గా పోటీ చేసిన టి.సుబ్బరామ గుప్తా ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి మెడికల్ అసోసియేషన్ సభ్యులు సుబ్బరామ గుప్తాకు అభినందనలు శుభాకాంక్షలు, తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఫార్మాసిస్టుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు పాత్ర పోషిస్తానని సుబ్బరామ గుప్త తెలిపారు.

శ్రీ స్వామి హథిరాం బావాజీ ఆలయ నిర్మాణానికి సహకరించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: శ్రీ వెంకటేశ్వర స్వామివారితో పాచికలాడిన మహానుభావుడు శ్రీ స్వామి హథిరాం బావాజీ వారి స్మారకంగా నిర్మించబడుతున్న శ్రీ స్వామి హథిరాం బావాజీ నూతన ఆలయ నిర్మాణంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆలయ వ్యవస్థాపకులు బుక్య శివ నాయక్ ఆదివారం ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. శ్రీ స్వామి హథిరాం బావాజీ వారు కేవలం ఒక మహాసాధువే కాకుండా, త్యాగం, భక్తి, నిరహంకారానికి ప్రతీకగా నిలిచిన ఆధ్యాత్మిక మహానుభావుడని తెలిపారు. అటువంటి మహనీయుడి ఆలయాన్ని నిర్మించడం ప్రతి భక్తుడి అదృష్టమని, ఈ పుణ్యకార్యంలో తిరుపతి ప్రజలు, భక్తులు, దాతలు చురుకుగా పాల్గొనాలని కోరారు. ఈ నూతన ఆలయ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపి, అవసరమైన సహకారం, అనుమతులు, మౌలిక వసతులు కల్పించి ఈ మహత్తర ఆధ్యాత్మిక కార్యాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పెరుమాల పల్లి జడ్పీ పాఠశాలలో 1998-99 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఇన్నేళ్ల తర్వాత కలిసి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించి ఒకరినొకరు గత రోజులను గుర్తు చేసుకుని సంతోషపడ్డారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. వివిధ రంగాలలో స్థిరపడ్డ స్నేహితులందరూ ఒక్కటైన సందర్భంలో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ పాఠశాల అనుభవాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బాలు, సుధాకర్, శేఖర్ రెడ్డి, రఘునాథరెడ్డి, మురళి, శంకర, బాలముని, కేశవులు, లోక, జయలక్ష్మి, రేవతి, కిరణ్, భారతి, మాధవి, శ్రీలేఖ పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా 'నో యువర్ హెరిటేజ్'

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి లోని జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయంలో నిర్వహిస్తున్న భారతీయ విజ్ఞాన సమ్మేళనం మూడవరోజు "నీ వారసత్వ సంపదని తెలుసుకో! పోటీ" (నో యువర్ హెరిటేజ్) ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. "వికసిత భారత్ కోసం సెమీకండక్టర్స్ అండ్ ఫాబ్" అనే ప్రత్యేక చర్చా సదస్సుకు ఐఐటి రూర్కీ ఆచార్యులు ప్రొఫెసర్ బులుసు ఆనంద్ సమన్వయకర్తగా, ఆచార్య శ్రీపద్ కర్మల్కర్ ఐఐటి భువనేశ్వర్, సంజీవ్ కేస్కర్, అరవింద్ కన్సల్టెన్సీ, ఆచార్య రోహిత్ శర్మ, ఐఐటి రోపార్, డాక్టర్ డా. కన్నన్ నారాయణన్ పానలిస్టులుగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి మిథిలా సమన్వయకర్తగా వ్యవహరించగా, న్యాయనిర్ణేతలుగా డాక్టర్ ఉజ్వల, సుశాంత్ భారతి వ్యవహరించారు. విద్యార్థులను సమ్మేళనం కన్వీనర్ కొంపెల్ల సుబ్బరాయశాస్త్రి, సంజయ్ భండారీ అభినందించారు. విజ్ఞాన సమ్మేళనంలో భాగంగా ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేయబడిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకుల్ని అలరించాయి.

శివరామకృష్ణకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి -వెంకటగిరి టౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న రాపూరు మండలానికి చెందిన సీనియర్ టీడీపీ నేత నువ్వుల శివరామకృష్ణను వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆదివారం పరామర్శించారు. కండలేరు డ్యామ్‌లోని శివరామ కృష్ణ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చెన్నైలో చికిత్స పొందిన అనంతరం శనివారం స్వగ్రామానికి చేరుకున్న శివరామకృష్ణ విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆయన నివాసానికి చేరుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. పార్టీ కోసం సేవలందిస్తున్న శివరామకృష్ణ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, ఆయన ఆరోగ్యం మెరుగుపడే వరకు పార్టీ తరపున అండగా ఉంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానిక టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమకాలీన జీవితానికి ఆధ్యాత్మిక మార్గదర్శనం

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి, వైస్రామర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సమకాలీన జీవితానికి ఆధ్యాత్మిక మార్గదర్శనం అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలో అజరామర గ్రంథమైన శ్రీమద్భగద్గీత సారాన్ని సులభమైన, సరళమైన భాషలో సామాన్యులకు అందించాలనే ఉద్దేశంతో పరంధామ పిళ్లై రచించిన అనువాద గ్రంథం 'శ్రీ మద్భగవద్గీత – తెలుగు గీతాలు" కర్మ చేయడం మన ధర్మం ఫలితాన్ని భగవంతునికి అర్పించడం మనశాంతి అనే గీత సందేశాన్ని కేంద్రంగా చేసుకొని యువత, ఉద్యోగులు, గృహిణులు, విద్యార్థులు ప్రతి ఒక్కరికి ఉపయోగపడేలా ఈ ప్రస్తకం రూపుదిద్దుకుందని విశ్రాంత మిత్ర సభ్యులు తెలియజేసారు.

పేదలకు భూములు పంచిన ఘన చరిత్ర సిపిఐది

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి రూరల్ ప్రాంతాలలో భూ పోరాటాల ద్వారా వేలాదిమంది పేదలకు ఇల్లు స్థలాలు పంచిన ఘనత సిపిఐదని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మురళి తెలిపారు. సిపిఐ 101 వ ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా వేదాంతపురం, మార్క్స్ నగర్లో ఆదివారం అరుణ పతాకాన్ని ఎగరవేసి, కేక్ కట్ చేసి కమ్యూనిస్టు పితామహుడు కారల్ మార్క్స్‌కు నివాళులర్పించారు. సిపిఐ 101 ఆవిర్భావం సందర్భంగా తిరుపతి అర్బన్ 3 వ డివిజన్ ప్రగతి నగర్ సిపిఐ శాఖ లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, పద్మావతి పురం సిపిఐ శాఖ లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె రాధాకృష్ణ ఎర్రజెండాను ఆవిష్కరణ చేశారు. అనంతరం వేదాంతపురం సర్కిల్లో సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిన్నం కాలయ్య ఎర్రజెండా ఎగర వేసి కమ్యూనిస్టుల ఘన చరిత్రను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కే.రాధాకృష్ణ, బి.నదియా, జల్లా విశ్వనాథ్, చిన్నం కాలయ్య, జింక నాగరాజ్, ఆర్.బలరాం, ఎం ఆర్ బాబు, పద్మనాభరెడ్డి, జైపాల్, ఇంద్రాణి, మల్లీశ్వరి, లక్ష్మమ్మ,ఈశ్వరయ్య , భూపతి రెడ్డి పాల్గొన్నారు.

చిత్తూరు డిస్ట్రిక్ విజిలెన్స్ కమిటీ మెంబర్‌గా పసల ప్రసాద్

ప్రజాశక్తి - చంద్రగిరి: చిత్తూరు డిస్ట్రిక్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్‌గా చంద్రగిరికి చెందిన పసల ప్రసాద్ నియమితులయ్యారు. సీఎం ఆదేశాల మేరకు చిత్తూరు కలెక్టర్ సుమిత్ మిశ్రా ఆధ్వర్యంలో డిస్ట్రిక్ విజిలెన్స్ కమిటీ మెంబర్‌గా ప్రకటించారు. పసల ప్రసాద్ నాంది సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫౌండర్‌గా, ప్రెసిడెంట్‌గా గత కొద్ది కాలంగా పేద ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భరత్ కుమార్ నాయుడు, ఆర్.నరసింహనాయుడు, కావలి బాలాజీ, చిట్టిబాబు, ఉదయ్ కుమార్, వెంకటయ్య, కత్తి నాగార్జున, మునిశేఖర్, పొట్లూరి శివ, డాక్టర్ ఆనంద్ కుమార్, కార్వేటినగరం మధు, పునబాకం హరిబాబు, రవిబాబు, పసల మధు తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి శ్రీ ప్రసన్న వెంకటేశ్వరుని సన్నిధి ముస్తాబు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: డిసెంబరు 30వ తేదీన వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని టిటిడి స్థానిక అప్పలాయిగుంట ఆలయంలో భక్తుల సౌకర్యార్థం విస్తృతంగా ఏర్పాట్లు చేట్టారు. ఆలయంలో ప్రత్యేక క్యూలైన్లు, చలువ పందిళ్లు, రంగవల్లులు తీర్చిదిద్ది వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరణలు చేయిస్తున్నారు. ఉదయం 1.35 నుండి రాత్రి 8 గంటల వరకు భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు.

న్యూ ఇండియా బేబీ ఒలింపిక్ గేమ్స్ ప్రారంభం

బేబి ఒలింపిక్ గేమ్స్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : ఫేస్ 111 ఎంటర్‌టైన్‌మెంటు ఆధ్వర్యంలో తిరుపతిలో న్యూ ఇండియా బేబీ ఒలింపిక్ గేమ్స్– సెకండ్ ఎడిషన్‌ను శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు ఆదివారం తిరుపతిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేబీ ఒలింపిక్ గేమ్స్ వంటి కార్యక్రమాలు చిన్నారుల శారీరక, మానసిక అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. చిన్న వయస్సులోనే శరీర కదలికలు, సమతుల్యత, సమన్వయం వంటి నైపుణ్యాలు అభివృద్ధి చెందేందుకు ఈ గేమ్స్ ఉపయోగకరంగా వుంటాయన్నారు. ఈ పోటీలు పిల్లల్లో చురుకుదనం, శక్తి పెంపొందించడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని తెలిపారు. జట్టుగా పని చేయడం, భాగస్వామ్యం, సాధారణ నియమాలను పాటించడం వంటి విలువలు చిన్నప్పటి నుంచే అలవడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బేబీ ఒలింపిక్ గేమ్స్ నిర్వాహకులు శ్రీకర్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసు, మారుతి హాస్పిటల్ మారుతి, కీర్తి, మదర్ హాస్పిటల్ పద్మజ, తానికొండ రంజిత్ నాయుడు, మధు, పవన్, గోపి పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ వాకర్స్ అధ్యక్ష, కోశాధికారులకు సన్మానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా డాక్టర్ రవి రాజు, కోశాధికారిగా ముని కృష్ణయ్య లు ఎన్నికైన సందర్భంగా పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ ఆదివారం వారిని ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా రవిరాజు మాట్లాడుతూ తన ఉన్నతికి సహాయ సహకారాలు అందించిన మాతృ సంస్థ పుత్తూరు అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం పిపిపి పథకాన్ని వాకర్స్ అసోసియేషన్‌తో అనుసంధానం చేయాలని కోరారు. ప్రతి అసోసియేషన్ ఒక గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి పరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగుదేశం నాయకుడు విజయబాబు మాట్లాడుతూ శల్య వైద్యం, వక్కపొడికి ప్రసిద్ధి చెందిన పుత్తూరు పట్టణం చుట్టుపక్కల ఆధ్యాత్మిక ఆలయాలు ఉండడం విశేషమన్నారు. అనంతరం రవిరాజు, మునికృష్ణలను ఘనంగా సన్మానించారు. సమావేశంలో 2027 సంవత్సరానికి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కె.ఎల్.ఎన్ మూర్తి, ఉపాధ్యక్షులుగా వెంకట్రామయ్య, కార్యదర్శిగా రఫీ, ఉప కార్యదర్శిగా రఘునాథరెడ్డి, కోశాధికారిగా గుణశేఖర్ రెడ్డి గోపికృష్ణలు ఎన్నికైనట్టు తెలిపారు.

ఎస్టీయూ జిల్లా అధ్యక్షులుగా సుధాకర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఎస్టీయూ జిల్లా అధ్యక్షులుగా వి.సుధాకర్ యాదవ్ ఎన్నికయ్యారు. ఎస్టీయూ తిరుపతి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వి. సుధాకర్ యాదవ్‌తో పాటు అత్యధిక సంఖ్యలో శ్రీకాళహస్తి డివిజన్ నుంచి ఉపాధ్యాయులకు పదవులు దక్కాయి. రాష్ట్ర కౌన్సిలర్ సభ్యులుగా చిర్రి హరికృష్ణ, యువ శ్రీ మురళి అసోసియేట్ అధ్యక్షులుగా పిట్టి చెంగయ్య, పి.శ్రీనివాసులు, అదనపు ప్రధాన కార్యదర్శులుగా నలపాటి సురేష్, గుమ్మడి మురళి, ఉపాధ్యక్షులు తొండు కృష్ణయ్య తదితరులు ఎన్నికయ్యారు.

ఘనంగా అంతర్జాతీయ లయన్స్ క్లబ్ దినోత్సవం

ప్రజాశక్తి - పాకల: అంతర్జాతీయ లయన్స్ సంస్థ జిల్లా 317ఈ కి చెందిన, రీజియన్ 5 సమావేశం రీజన్ చేర్ పర్సన్ లయన్ రామయ్య అధ్యక్షతన పాకాలలోని స్థానిక కల్యాణ మండపంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పాకాల, దామాలచెరువు, పీలేరు, కల్లూరు, కలకడ, సదుంకు సంబంధించిన అన్ని లయన్స్ క్లబ్ సభ్యులు, లియో క్లబ్ సభ్యులు హాజరయ్యారు. అతిథులను గనంగా సన్మానించారు. ఈ సమావేశనికి బెంగుళూరు నుండి గవర్నర్ లయన్ అశ్వత నారాయణ, మాజీ గవర్నర్లు లయన్ డాక్టర్ ప్రసాద్, లయన్ భానుమర్తి రెడ్డి, కోశాధికారి లయన్ శ్రీనివాసులు, అదనపు కార్యదర్శులు లయన్ రాజరెడ్డి, రాజేంద్ర ప్రసాద్, లయన్ గౌతమ్ రెడ్డి,లయన్ మహమ్మ డాలి, లయన్ గురుస్వామి నాయుడు,లయన్ దామోదర్ నాయుడు, లయన్ వేణుగోపాల్, లయన్ నాగూర్ బాషా, లయన్ వెంకటసిద్దులు, లయన్ దగ్గుబాటి వెంకటేశ్వర్లు నాయుడు, లయన్ తులసిరామ్, హాజరయ్యారు.

కోయిల్ ఆల్వార్ తిరుమంజనంలో నెలవల సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట పట్టణ సమీపంలోని స్వర్ణముఖి నది తీరాన తిమ్మాజీ కండ్రిక గ్రామం వద్ద వెలసిన శ్రీ అభయానుగ్రహ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా చేపట్టిన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముక్కోటి ఏకాదశి కార్యక్రమాల కోసం సిద్ధమవుతున్న ఆలయానికి ఆయన టీడీపీ నాయకులతో కలిసి ఆలయ శుద్ధి పనులు చేపట్టారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు స్వామివారికి పూజలు చేసి వారికి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఆయన వాస్తు శాస్త్ర పండితులు పద్మనాభ స్వామి నివాసానికి చేరుకుని ఆయనను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సంచి కృష్ణయ్య, నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసమంగాపురంలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు

ప్రజాశక్తి - చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలో వెలసిన శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 30 వతేది వైకుంఠ ఏకదశి, 31 న ద్వాదశి, జనవరి 1 న కొత్త ఏడాదిని పురష్కరించుకోని విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో ప్రత్యేక క్యూలైన్లు, చలువ పందిళ్ళు, మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణలతో ఆలయం శోభాయమానంగా తీర్చిదిద్దారు. 30 వ తేది వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వేకువజామున 12.05 గంటల నుండి 2.30 గంట వరకు ధనుర్మాస కైంకర్యాలు, తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. వేకువజామున 2.30 నుండి సాయంత్రం 4 గంటల వరకు భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. ఈ పర్వదినాలను పురస్కరించుకుని టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఆలయంలో ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

క్రైం న్యూస్

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి, పాదిరేడు గొల్లపల్లి బీట్ లోని దిగువ నేరేడుచర్లం ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా దాచి ఉంచిన 32 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్వీఎన్పి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. శనివారం తిరుపతి జిల్లా అటవీ శాఖ అధికారి సాయిబాబాకు అందిన రహస్య సమాచారం మేరకు ఈ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టామని తెలిపారు. ఈ 32 ఎర్రచందనం దుంగల బరువు 165 కేజీలుగా ఉందని చెప్పారు. ఈ కూంబింగ్ ఆపరేషన్‌లో ఎఫ్బిఓ మునియా నాయక్, చెల్లూరు బేస్ క్యాంపు వాచర్లు పాల్గొన్నారన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో వైన్ షాప్ దగ్ధం

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, తొండవాడలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వైన్ షాప్ దగ్ధమైంది. పోలీసులు తెలిపిన సమాచారం తొండవాడలోని భాస్కర్రెడ్డికి చెందిన వైన్ షాపులో ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో షాపులో మంటలు చెలరేగాయి. షాపులో నుంచి పొగ మంటలు రావడంతో స్థానికులు అప్రమత్తమై మంటలను అదుపు చేశారు. అప్పటికే షాపులోని ఖరీదైన మద్యం బాటిళ్ళు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ రవిప్రకాష్రెడ్డి, సిబ్బందితో వైన్ షాపును పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసారు. అనంతరం ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందుకుని షాపులోని దగ్ధమైన మద్యం పరిశీలించి, కాలిపోయిన మద్యాన్ని ధ్వంసం చేయనున్నట్లు తెలిపారు. అయితే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన సుమారు రూ.30 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని వైన్ షాపు యజమాని తెలిపాడు.

వివాహిత ఆత్మహత్య

మృతి చెందిన మంజుల

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు మండలం, బాలగోపాలపురం ఎస్సీ కాలనీకి చెందిన టీ.మంజుల పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు సత్యవేడు మండలం రాజగోపాలపురం పంచాయతీ, బాలగోపాలపురం ఎస్టీ కాలనీకి చెందిన టి.మంజులను రెండు సంవత్సరాల క్రితం ఇ.దేసయ్య ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. దేసయ్యకు మద్యం తాగే అలవాటు ఉండటంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవ జరిగేవి. మంజుల భర్త త్రాగుడు మానేయమంటూ తరచూ గొడవపడేది. ఈ నేపథ్యంలో మంజుల తన భర్త దేశయ్యకు దేవుని మాల వేయించారు. దీక్షతో త్రాగుడు మానేయాలని భర్తకు సూచిస్తూ వచ్చింది. దేసయ్య ఈనెల 27వ తారీఖున శనివారం దేవుని మాల తీసేసి పూర్తిగా మద్యం సేవించాడు. ఈ విషయం తెలుసుకున్న మంజుల భర్తపై గొడవపడి అలిగింది. భర్త ఇంట్లో లేని సమయం చూసి ఇంట్లో ఉన్న గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న భర్త దేశయ్య సత్యవేడు పోలీసులకు సమాచారమిచ్చి సత్యవేడు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేసి సమీపంలోని శ్రీకాళహస్తి ప్రభుత్వాసుపత్రికి మెరుగైన చికిత్స కొరకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంజుల ఆదివారం మృతి చెందింది. దీనిపై సత్యవేడు రెండవ ఎస్సై లావణ్య కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రీహాబిలిటేషన్ అండ్ ఎడ్యుకేషన్ ఫర్ డిసబుల్డ్(రెడ్) సంస్థ ఆధ్వర్యంలో గూడూరు మున్సిపల్ పట్టణంలోని 20 మంది పేద దివ్యాంగులకు రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వారి సహకారంతో, రాజనేని శ్రీనివాసులు –శిరీష సూచనమేరకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు జానా సుధీర్, ట్రెజర్ ప్రోహిద్ రాజేష్,అరవ శ్రీనివాసులు పాల్గొనారు.

వెంకటేష్ రెడ్డికి రోజా పరామర్శ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపాలిటీ పరిధి, గేట్ పుత్తూరులో వైఎస్ఆర్సిపి వాణిజ్య విభాగ అధ్యక్షులు ఏ స్ వెంకటేష్ రెడ్డి (మీసాల రెడ్డి) తిరుపతి హాస్పిటల్‌లో అపెండిసైటిస్ శస్త్రచికిత్స చేయించుకున్న అనంతరం ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. సమాచారం అందుకున్న మాజీ మంత్రి ఆర్.కే. రోజా ఆదివారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా వైద్యుల సూచనలు, చికిత్స వివరాలను అడిగి తెలుసుకుని, త్వకరలో సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు, మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయ ప్రకాష్, శంకర్, ఎస్ టి సెల్ జిల్లా నాయకులు చిరంజీవి, సి ఎస్ దిలీప్ కుమార్, ఆలయ మాజీ చైర్మన్ మనోహర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నెహ్రూ యువజన సేవా సంఘం అధ్యక్షులు జ్యోతి లక్ష్మి పేర్కొన్నాను. ఆదివారం వడమాలపేట మండలం ఎస్వి పురం గ్రామంలో నెహ్రూ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో అంజెరమ్మ గుడి ఆవరణలో కొబ్బరి, వేప, కానుగ, నేరేడు, ఉసిరి, మారేడు వంటి మొక్కలు నాటారు. రాష్ట్ర యువజన అవార్డు గ్రహీత వెంకమరాజు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘ సభ్యులు మురళి, రమణ రాజు, తులసి, నాదముని, ప్రవీణ్, చిరంజీవి, చెంగ్రాయులు, సురేష్, కన్నయ్య, సుబ్రహ్మణ్యం రాజు పాల్గొన్నారు.